కిక్కిరిసిన అప్పనపల్లి క్షేత్రం



అప్పనపల్లిలో బాలబాలాజీ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అభయాంజనేయునికి నిర్వహించిన తమలపాకుల పూజ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం భారీగా భక్తులు తరలివచ్చారు. పవిత్ర కార్తిక మాసం కావడంతో విశేష సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామున వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. స్వామివారి సన్నిధిలో హోమం వైభవంగా జరిపించారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి, కోరిన కోర్కెలు నెరవేరాలని స్వామివారిని వేడుకున్నారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.3.38 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2.32 లక్షలు రాగా, నిత్యాన్నదాన పథకానికి రూ.1,05,829 విరాళంగా వచ్చాయి. 4,583 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 3,164 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ జి.శ్రీదేవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా లక్ష తమలపాకుల పూజ

మామిడికుదురు: స్థానిక అభయాంజనేయ స్వామికి శనివారం సుందరకాండ సహిత లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. విష్వక్సేనపూజతో ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. బ్రహ్మశ్రీ బిక్కవోలు కేశవాచార్యుల పర్యవేక్షణలో సుదర్శనం వేంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో ఈ పూజ ఘనంగా జరిపించారు. తమలపాకులు, గంధ సిందూరంతో స్వామికి పూజలు జరిపించారు. మండపారాధన, అభిషేకం, అగ్నిమథనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు వేద మంత్రాల నడుమ అంగరంగ వైభవంగా జరిగాయి. రేలంగికి చెందిన అచ్యుత పండు ఆధ్వర్యంలో మెంటాలమ్మ కోలాట భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాటం భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సహస్ర దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో భాగంగా ఆలయం వద్ద భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో భారీగా భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు మారుతీ ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాగణంలో కోలాటం ఏర్పాటు చేశారు.

ప్రజల అభివృద్ధికి సీఎం కృషి



కేశవదాసుపాలెంలో పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చెప్పినవే గాకుండా, చెప్పనవి కూడా చేసి ప్రజల అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం కేశవదాసుపాలెంలో 253వ రోజు ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, గత పరిపాలనకు, ఇప్పటి పరిపాలనకు మధ్య తేడా ప్రజలు గుర్తించాలని అన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు యెనుముల చిట్టిబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, పెదపాటి నాగలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు కొల్లాబత్తుల చిట్టిబాబు, గన్నాబత్తుల సత్యనారాయణ, నాయకులు గెడ్డం అమ్ములు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సరిచూసుకోండి

అంబాజీపేట: మండలంలో నిర్వహిస్తున్న ఓటు నమోదు క్యాంపెయిన్ దేను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎన్నికల సెక్టోరియల్ అధికారి కె.శ్రీధర్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్ బూత్ వద్ద నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపును శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో అధికారులు అందుబాటులో ఉంటున్న దృష్ట్యా కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు నమోదు, సవరణ, తొలగింపులకు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలన్నారు.

ఆలమూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 2, 3 తేదీల్లో తలపెట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని తహసీల్దార్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ బీపీ శెట్టి కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సందర్శించి బూత్ లెవెల్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలన్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాలకు ఆహ్వానం

అయినవిల్లి: 21 ప్రపంచ రికార్డులను సాధించిన సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 16 17 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో నిర్విరామంగా జరగబోయే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు అయినవిల్లి మండలం మాగం గ్రామానికి చెందిన వీధి దుర్గారావు మాస్టారుకి ఆహ్వానం అందింది. ఈ మేరకు శనివారం దుర్గారావు స్థానిక విలేకరులకు ఓ ప్రకటనలో తెలిపారు. దుర్గారావు జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాల చింతనలంకలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల పాటు జరుగబోయే సకల కళా ప్రదర్శనల్లో మాస్టారు తమ కవితాగానం చేయనున్నారు. గతంలో 12 గంటల 12 నిమిషాల 12 సెకన్ల పాటు మలికిపురంలో మరియు 48 గంటల పాటు తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ స్థాయి కళాఉత్సవాల్లో దుర్గారావు మాష్టారు పేరు పలు ప్రపంచ రికార్డుల్లో నమోదయింది.

భూహక్కు చట్టంతో తీవ్ర సమస్యలు

రాజోలు: భూహక్కు చట్టం ద్వారా భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అధ్యక్ష, కార్యదర్శులు కోట సుధాకర్, కొక్కెరగడ్డ శేషగిరిరావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. భూ వివాదాల పరిష్కారం కోసం రూపకల్పన చేసిన చట్టం ఆ వివాదాలకే కారణమవుతుందన్నారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. న్యాయవాదులు సాయిబాబు, ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే కాలుష్యం దూరం



మొక్క నాటుతున్న డీజీఎం సందీప్‌కుమార్

పి.గన్నవరం: నరేంద్రపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. ఓఎన్జీసీ డీజీఎం సందీప్‌కుమార్ మొక్కను నాటి మొక్కల ప్రాధాన్యతను వివరించారు. మొక్కల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. దీనిలో భాగంగా 90 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పున్నం వేణు, పీఎంసీ చైర్మన్ జల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ బీర వెంగమాంబ, వైస్ చైర్మన్ యు.రాజేష్, ప్రముఖులు వి.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆరో తరగతి విద్యార్థిని వడ్డి సుష్మకు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు శనివారం రూ.10 వేల ఆర్థిక సాయం పంపిణీ చేశారు. సుష్మకు గుండెకు సంబంధించి వైద్యం నిమిత్తం స్థానిక విద్యార్థి సంఘ నాయకులు పై మొత్తాన్ని సేకరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే పై సాయాన్ని అందజేశారు. సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

నేదునూరులో ప్రత్యేక వైద్యశిబిరం

అయినవిల్లి: రావిఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నేదునూరులో ఉచిత వైద్యశిబిరం శనివారం ఏర్పాటు చేశారు. అమలాపురం సుధీర్ ఆస్పత్రి ఆధ్వరంలో వైద్యులు వై.సుధీర్‌కుమార్, కె.అనూష 218 మంది రోగులకు వైద్య సేవలందించారు. ఉచితంగా రక్త పరీక్షలు, మందులు అందజేశారు. జనరల్, స్త్రీ సంబంధ వ్యాధులపై పరీక్షించారు. రావి ఫౌండేషన్ సెక్రటరీ పాలగుమ్మి వెంకట కృష్ణ, రావి ఫౌండేషన్ మెడికల్ విభాగం ఇంచార్జ్ జంగా నాగేశ్వరరావు, సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీ క్లోపల్లి సుబ్బరాజు, మాజీ సర్పంచ్ కామన కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం నాయకుడు అలీ మృతి

కొత్తపేట: స్థానిక ముస్లిం నాయకుడు, పూర్వ మసీదు నిర్మాతల్లో ఒకరైన సయ్యద్ అజ్గర్ అలీ (85) శనివారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి మండల ముస్లిం సంఘ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



ఆకట్టుకున్న లక్ష దీపోత్సవం

మామిడికుదురు: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. శ్రీ, భూ సమేత బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం లక్ష కార్తిక దీపాలను వెలిగించారు. భారీ సంఖ్యలో భక్తులు దీపోత్సవంలో పాల్గొని కార్తిక దీపాలు వెలిగించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివాలయాల్లో బిల్వపత్ర పూజలు

అయినవిల్లి: స్థానిక అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామికి, ముక్తేశ్వరం ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వర స్వామికి, నేదునూరు సర్వమంగళపార్వతీదేవి సమేత చెన్నమల్లేశ్వరస్వామికి శనివారం లక్షబిల్వ పూజలు నిర్వహించారు.

బైక్ చోరీపై కేసు

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన చింతల శ్రీరాములు ఇంటి వద్ద ఉంచిన గ్లామర్ బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని శ్రీరాములు ఫిర్యాదు చేశాడు. మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు.

రెల్లి కులగణన చేపట్టాలి

రాజోలు: జస్టిస్ రోహిణి కమిషన్ సూచనలతో రెల్లి, రెల్లి ఉపకులాల గణన చేపట్టాలని రెల్లి తెగ హక్కుల పోరాట సమితి కార్యదర్శి వైకే రాజు కోరారు. ఈ మేరకు అమలాపురం ఆర్డీఓ జి.కేశవవర్ధనరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. రెల్లి, రెల్లి ఉపకులాల గణన సక్రమంగా నిర్వహిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు.

స్వయం సమృద్ధి సాధించాలి

మామిడికుదురు: మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని రాజమహేంద్రవరం క్వాయర్ బోర్డు రీజినల్ ఆఫీసర్ టీజే ఏసుదాసు అన్నారు. పాశర్లపూడిబాడవలో నిర్వహించిన కొబ్బరి పీచుతో హస్తకళల తయారీ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మహిళలు తయారు చేసిన బొమ్మలను ఆయన పరిశీలించారు. 20 మంది మహిళలకు రూ.1.66 లక్షలతో అక్టోబర్ 30న ఉచిత శిక్షణ ప్రారంభించామని చెప్పారు. కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు నెలకు రూ.మూడు వేల చొప్పున స్టయిఫండ్ ఇచ్చామని ఏసుదాసు అన్నారు. శిక్షణ పొందిన మహిళలకు ఆర్వో సర్టిఫికెట్లు అందించారు. రాష్ట్రంలో ఇంత వరకూ 200 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చామని ఏసుదాసు తెలిపారు. త్వరలో క్వాయర్ జ్యూయలరీపై మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. కంపెనీ చైర్మన్ వేగి వెంకటేశ్వరరావు, ట్రైనర్ ఎం.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామి సన్నిధిలో ఎన్నికల డిప్యూటీ సీఈవో

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం ఏపీ రాష్ట్ర ఎన్నికల డిప్యూటీ సీఈవో ఆదూరి వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డు ప్రసాదం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి

అంబాజీపేట: క్రీస్తు చూపించిన మార్గంలో అందరూ పయనిస్తూ ప్రేమ, దయ అందరూ కలిగి ఉండాలని బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ జి.వరప్రసాద్, కన్స్యూమర్స్ కమిషన్ జడ్జి చిరంజీవి పిలుపునిచ్చారు. అంబాజీపేట కల్వరి క్రిస్టియన్ ప్రేయర్ హౌస్ చర్చిలో బిషప్ జల్లి జార్జిపాపఫ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సంబరాలను శనివారం జిల్లా బిషప్స్, పాస్టర్స్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ ప్రభుత్వంలో దైవ సేవకులకు ఇచ్చిన గౌరవ వేతనం ఏ ప్రభుత్వం అందించలేదన్నారు. తొలుత క్రిస్మస్ కేకును కట్ చేసి, కొవ్వొత్తులను వెలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ జల్లి విక్టర్ కుమార్, జాన్ పాల్, అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో పెట్టిన వారికే మద్దతు

అంబాజీపేట: గ్రామాభివృద్ధికి పాటుపడే సర్పంచ్‌ల డిమాండ్లను మేనిఫెస్టోలో పెట్టిన పార్టీ వారికే తమ పూర్తి మద్దతు తెలుపుతామని జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు చెల్లుబోయిన హెలీనా అన్నారు. అంబాజీపేట పెద్దవీధిలో ఉన్న కోకోనట్ అసోసియేషన్ భవనంలో నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో శనివారం సమావేశం నిర్వహించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీల అధికారాలు, విధులు, హక్కుల సాధించుకొనుటకు సమాఖ్య కలసికట్టుగా పయనించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 11న కాకినాడలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

మామిడికుదురు: బాల్య వివాహాలను అరికట్టాలని, ఆడ, మగ తేడా లేకుండా పిల్లల్ని పెంచాలని, లింగ వివక్షత విడనాడాలని, రక్తహీనత తగ్గించాలని, మహిళలపై జరిగే అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ పాశర్లపూడిలో మహిళలు శనివారం ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో జెండర్ ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. జిల్లా సమాఖ్య ప్రతినిధి రోజా, కె.దుర్గాభవాని, బి.శాంతి కుమారి మాట్లాడారు. పాశర్లపూడి కూడలిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు.

67 మంది రైతులకు పట్టాల పంపిణీ

పి.గన్నవరం: మండలంలో శనివారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు. పెదపూడిలో 67 మంది రైతులకు 9.64 ఎకరాల లంక భూమిని అయిదేళ్ల లీజుకు పట్టాలుగా ఇచ్చారు. ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పెదపూడి, ఊడిమూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలకు మంజూరైన స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. పెదపూడి ఉన్నత పాఠశాలకు జగనన్న గోరుముద్ద ద్వారా మంజూరైన వంట పాత్రలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిగా సాయికిషోర్

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ ద్వితీయ వైద్యాధికారిగా డి.సాయికిషోర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడకు చెందిన ఆయనకు ఇటీవల రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనరేట్ పర్యవేక్షణలో విజయవాడలో జరిగిన వైద్యుల నియామక కౌన్సెలింగ్‌లో వైద్యుడిగా నియమితులయ్యారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆరు నెలల వ్యవధిలోనే తొలిసారి స్థానిక వైద్యాధికారిగా ఆయనకు పోస్టింగ్ లభించింది. స్థానిక వైద్యారోగ్య అధికారులు, సిబ్బందితో కలిసి పేదల ఆరోగ్య రక్షణకు తమ వంతు కృషి చేస్తానని వైద్యాధికారి సాయికిషోర్ హామీ ఇచ్చారు.

అన్నదానానికి రూ.50,116 విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన చెరుకూరి అజిత్, రమ్యశ్రీ దంపతులు రూ.50,116 విరాళం అందించినట్లు ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు



జొన్నాడ ఆరాధన వేడుకల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో శనివారం మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్యక్రిస్మస్ ఆరాధన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక రైతు భవనంలో జిల్లా అధ్యక్షుడు డానియల్ పాల్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌ను కట్‌చేసి క్రీస్తు సందేశాన్ని అందించారు. ప్రతి ఒక్కరూ ఇతరులపై ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండి పరోపకారం చేయడమే ప్రభువైన క్రీస్తు మార్గమన్నారు. లోక రక్షకుడైన యేసుపై అందరూ విశ్వాసం ఉంచి ఆయన కృపకు పాత్రులు కావాలన్నారు. జిల్లా అధ్యక్షుడు డానియల్ పాల్ సమకూర్చిన నూతన వస్త్రాలను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా పాస్టర్ ఫెలోషిప్ సభ్యులకు అందజేశారు. అలాగే పాస్టర్ ఫెలోషిప్ సమాఖ్యకు తమ వంతు సహకారంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి, పాస్టర్ ఫెలోషిప్ ప్రతినిధులు యు.సుందరం విజయం, వై.చినబాబు, సీహెచ్ ధనరాజు తదితరులు పాల్గొన్నారు..

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దాం



అంబాజీపేటలో క్రీడాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రభుత్వం అందజేసిన క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే చేతుల మీదుగా సచివాలయం సిబ్బందికి శనివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 ఏళ్లు నిండిన బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పోటీలు ఉంటాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలను నిర్వహిస్తున్నారన్నారు.

వంటపాత్రల పంపిణీ

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు ప్రభుత్వం మంజూరైన వంట పాత్రలను ఎమ్మెల్యే చిట్టిబాబు చేతుల మీదుగా హెచ్ఎం కె.సాయిరామ్‌కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సీఎం జగన్ తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వైఎస్సార్ సీపీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు, మైలా ఆనందరావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, మట్టపర్తి యజ్ఞశ్రీ, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్య నివారణకు కృషి చేయాలి



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు

కొత్తపేట: వాయు కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు పిలుపునిచ్చారు. జాతీయ వాయు కాలుష్య నివారణ దినోత్సవం పురస్కరించుకుని శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును రసాయనశాస్త్ర విభాగాధిపతి పి.సాయికృష్ణ, ఏకో క్లబ్ విభాగాధిపతి బి.విజయకుమార్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాయు కాలుష్యం వలన శ్వాసకోశ సంబంధిత వ్యాధులు సంభవిస్తాయన్నారు. ఈ ప్రమాదం సంభవించకుండా ఉండాలంటే ఈ ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు.

ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవం

ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ నేటి యుగంలో కంప్యూటర్ ఆవశ్యకతను వివరించారు. కంప్యూటర్‌తో అన్ని పనులు సులభతరమయ్యాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అకడమిక్ కోఆర్డినేటర్ టి.రమాదేవి, ఐకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అంకమరావు, అధ్యాపకులు సత్యనారాయణ, డీసీహెచ్ పాపారావు, జయశ్రీ, ప్రసన్న, నాగజ్యోతి, సాయిలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మేడిచర్లపాలెం జెడ్పీ పాఠశాలలో అభినందనలు అందుకున్న విద్యార్థినులు

మలికిపురం: కాకినాడ జేఎన్టీయూలో జరిగిన క్రియా పిల్లల పండగలో రాష్ట్ర స్థాయి పోటీలలో మేడిచర్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నట్టు హెచ్ఎం కె.సాయిబాబు శనివారం తెలిపారు. పోస్టల్ ప్రెజెంటేషన్‌లో సీనియర్, జూనియర్ విభాగంలో మట్టితో బొమ్మలు సీనియర్ విభాగంలోను, మ్యాథ్స్ ప్రాజెక్ట్ సీనియర్ విభాగంలో నలుగురు విద్యార్థులు ప్రథమ బహుమతులు, క్రాఫ్ట్ సీనియర్ విభాగంలోను, కథ చెప్పడం జూనియర్ విభాగంల్లో, బుర్రకథలో సీనియర్స్ విభాగంలోను ముగ్గురు ద్వితీయ బహుమతులు, బుర్రకథలు జూనియర్స్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో ఇద్దరు తృతీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. కాగా గెలుచుకున్న విద్యార్థినులకు అభినందన సభ జరిగింది. ఎంఈవో-1 ఎం.వి జయశ్రీ, ఎంఈవో-2 వైవీ సత్యనారాయణ, సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి, మేడిచర్ల రామలింగేశ్వరరావు, ఎంపీటీసీ ముత్యాల సాయిరాం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.దుర్గాప్రసన్న పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



పెదపట్నంలో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు.పెదపట్నంలో రూ.27.84 లక్షలతో చేపట్టనున్న పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన నిధులతో పి.గన్నవరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య పూర్తి స్థాయిలో పరిష్కారమైందన్నారు. గ్రామంలోని శివారు ప్రాంతాలకు సైతం తాగునీరు అందించే దిశగా కార్యాచరణ చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ట్యాంకులు, పైప్‌లైన్ పనులు పూర్తయిన పక్షంలో తాగునీటి సమస్య అన్నది ఉండదని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల దుర్గ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, గ్రామశాఖ అధ్యక్షుడు కొమ్ముల చిన్న, యేడిద లక్ష్మణరావు, కొమ్ముల శ్రీను, కీర్తి రైన పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం: విద్యార్థులందరూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని, ప్రస్తుత సమాజం అంతా కంప్యూటర్ మీద ఆధారపడిందని, రానున్న రోజుల్లో డిజిటల్ టెక్నాలజీ మనిషిని ప్రభావితం చేస్తుందని వైస్ ప్రిన్సిపాల్ బీహెచ్ సత్యమూర్తి అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రపంచ కంప్యూటర్ లిటరసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు డాక్టర్ సుభాషిని ఆధ్వర్యంలోఅవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బీహెచ్ సత్యమూర్తి మాట్లాడుతూ విద్యార్థులందరూ కంప్యూటర్ పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలని, ప్రస్తుత సమాజం అంతా కూడా కంప్యూటర్ మీద ఆధారపడిందని, రానున్న రోజుల్లో డిజిటల్ టెక్నాలజీ మనిషిని ప్రభావితం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కంప్యూటర్లో పరిజ్ఞానాన్ని లోతుగా పెంచుకోవాలని సూచించారు. అనంతరం కంప్యూటర్‌పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి వాటిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.